సాక్షి కాకినాడ

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



అన్నవరం దేవస్థానానికి విరాళం

అన్నవరం: గో సంరక్షణ ట్రస్ట్‌కు కె.విజయబాబు దంపతులు (కాకినాడ) రూ.1.50 లక్షలు, నిత్యాన్నదానానికి కేవీ నారాయణశర్మ దంపతులు (హైదరాబాద్) రూ.లక్ష విరాళమిచ్చారు.



తప్పాసులు జాగ్రత్త

మతాబులు మమతలు పూయ.. చిచ్చుబుడ్లు కాంతులనీయ.. తారాజువ్వలు గాలిలో ఎగరేయ.. వెలుగుల పండగను ఆనందాల రవళిలా జరుపుకొందాం.

II లో

1.54 లక్షల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం 1,54,064 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 2,700, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు. భద్రాచలం వద్ద 17.90, కాటన్ బ్యారేజీ వద్ద 10.10 అడుగులకు నీటి మట్టాలు చేరాయి.

న్యూస్‌రీల్

రత్నగిరి భక్త జనసంద్రం

- సత్యదేవుని దర్శించిన 30 వేల మంది
- స్వామివారి ఆదాయం రూ.25 లక్షలు



స్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 1,800 స్వామివారి వ్రతాలు జరిగాయి. భక్తులు సప్త గోకులంలో గోవులకు ప్రదక్షిణలు చేసి, రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. వివిధ విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. నాలుగు వేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఇలాఉండగా, ఆలయ ప్రాకారంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఘనంగా ఊరేగించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అమ్మవారి ఉత్సవమూర్తులను తిరుచ్చి వాహనంపై ప్రతిష్ఠించి అర్చకులు పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛాటన మధ్య మంగళ వాయిద్యాల నడుమ పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రాగా, మూడు సార్లు ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

తిరుపతిలో పోటెత్తిన భక్తులు



స్వామి వారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

పెద్దాపురం(సామర్లకోట): పెద్దాపురం మండలం తిరుపతి గ్రామంలో వేంచేసిన శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి అనేక మంది భక్తులు కాలినడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. సుమారు పది వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.1,47,150, అన్నదాన విరాళాలుగా రూ.54,035, కేశ ఖండన ద్వారా రూ.4,240, తులాభారం ద్వారా రూ.50, ప్రసాద విక్రయం ద్వారా రూ.16,845, స్వామివారికి కానుకలు తదితర వాటితో మొత్తం రూ.2,22,421 ఆదాయం వచ్చిందని చెప్పారు. సుమారు 3,500 మంది భక్తులు మధ్యాహ్నం అన్న ప్రసాదం స్వీకరించారు.

కాకినాడ డీఎస్‌డీఓగా రమణ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ జిల్లా క్రీడాభివృద్ధి అధికారిగా ఎస్‌వీ రమణను నియమిస్తూ శాప్ వీసీ, ఎండీ ఎస్.భరణి ఉత్తర్వులు జారీ చేశారు. శాప్ ఎండీగా భరణి బాధ్యతలు చేపట్టాక పరిపాలనా పరంగా రాష్ట్రవ్యాప్తంగా డీఎస్‌డీఓలు, కోచ్‌ల బదిలీలు చేశారు. ఇందులో భాగంగా కాకినాడ డీఎస్‌డీఓగా పనిచేస్తున్న బి.శ్రీనివాస్‌కుమార్‌ను విజయవాడ శాప్ హెడ్ క్వార్టర్స్‌కు బదిలీ చేశారు. శాప్ హెడ్ క్వార్టర్స్‌లో ట్రైబల్ వెల్ఫేర్ అధికారిగా ఉన్న ఎస్‌వీ రమణను కాకినాడ డీఎస్‌డీఓగా నియమించారు. జిల్లా క్రీడా మైదానంలో బాస్కెట్ బాల్ కోచ్‌గా పనిచేస్తున్న వైకుంఠరావు రుద్రను కోనసీమ డీఎస్‌ఏకు డీఎస్‌డీఓగా బదిలీ చేశారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లా?



పత్రికా స్వేచ్ఛను హరించడమే..



ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా స్వేచ్ఛ భారత రాజ్యాంగం కల్పించింది. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కథనాలు రాస్తున్నారన్న సాకుతో సంపాదకులు, విలేకరులపై కేసు పెట్టి కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సరికాదు. పార్టీలు, ప్రభుత్వాలు వేరైనా పత్రికా స్వేచ్ఛను ప్రతి ఒక్కరూ కాపాడాలి. నిజాలు నిర్భయంగా రాసే పత్రికలకు సంపూర్ణ మద్దతు ఉంటుంది. 'సాక్షి' దినపత్రిక, ఎడిటర్‌కు నోటీసులు ఇవ్వడం, అక్రమ కేసులు బనాయించడం సరికాదు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమే.

– బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ, అమలాపురం

'సాక్షి'పై పోలీసు జులుం సరికాదు



కూటమి ప్రభుత్వం ఏది చెబితే అది.. ఎవరి పేరు చెబితే వారిని వేధించడం పోలీసులు మానుకోవాలి. 'సాక్షి' పత్రికపై పోలీసు జులుం సరికాదు. 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై పోలీసు కేసులు పెట్టి ఇబ్బంది పెట్టడం చూస్తుంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ వార్త రాసినా ఇలా అక్రమ కేసులతో కక్ష తీర్చుకుంటుందని స్పష్టమవుతోంది. ఇదే కొనసాగితే ఏదో రోజు ప్రభుత్వంతో పాటు పోలీస్ అధికారులూ ఇబ్బంది పడక తప్పదు.

– కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ, అమలాపురం

చీకటి బతుకుల్లో కాంతిపుంజమై..





- ఊరూవాడా దీపావళికి ఘనంగా ఏర్పాట్లు
- జిల్లా వ్యాప్తంగా భారీగా బాణసంచా దుకాణాల ఏర్పాటు
- కీలక శాఖాధికారుల పర్యవేక్షణ
- పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలంటున్న పర్యావరణవేత్తలు

దివ్వెల పండగ దీపావళి జన జీవితాల్లో నూతన కాంతులు నింపనుంది. దీపాల కాంతులు, బాణసంచా మెరుపులు ఉవ్వెత్తున ఆకాశంలో వెలుగులు విరజిమ్మనున్నాయి. నూతనోత్తేజానికి చిహ్నాలుగా, నిండు జీవితాల ప్రతిబింబాలుగా ఆవిష్కృతం కానున్నాయి, మిరుమిట్లు గొలిపే మేటి కాంతులై.. దీపావళిగా హృదయాంతరాళాన్ని తాకనున్నాయి.

కాకినాడ క్రైం: వెలుగు నీడల పండగ వెనుక గతంనాటి విషాదాలు, గతించిన విధ్వంసాలు మనోఫలకంపై కన్నీటి చారికల్ని హెచ్చరికల్లా మిగిల్చాయి. పండగ చేసుకునేందుకూ ఓ పద్ధతుందంటూ గుర్తు చేస్తుంటాయి. ప్రకృతిని ధ్వంసం చేసే హక్కు ఎక్కడిదని ప్రశ్నిస్తుంటాయి. పండగ సరే.. పర్యావరణం సంగతేంటని తత్వాన్ని బోధిస్తుంటాయి. దీపావళికి పురాణ ప్రాధాన్యం ప్రశస్తమైనది. 14 ఏళ్ల వనవాసం చేసిన శ్రీరాముడు అయోధ్యకు తిరిగొచ్చిన వేళ అక్కడి ప్రజలు దీపాలు వెలిగించి స్వాగతం పలికారట, ఆ సందర్భమే దీపావళికి ఆవిర్భావంగా చెబుతారు. నరకాసురుడ్ని కృష్ణుడు వధించిన రోజుగా, జైన సంప్రదాయం ప్రకారం భగవాన్ మహావీరుడు నిర్వాణం పొందిన రోజుగా దీపావళిని పేర్కొంటారు.

బాణసంచా తప్పనిసరా..!

దీపావళి వేళ బాణసంచా కాల్చడం తప్పనిసరి ఆచారం అని ఏ పురాణాల్లోనూ చెప్పలేదు. శ్రీరాముడంతటి వాడే అయోధ్యకు వస్తే నూనె దీపాల వెలుగులతో ఆహ్వానించారు మినహా, బాణసంచా కాల్చిన దాఖలాలు లేవు. దీపాలు వెలిగించడం, దేవాలయ దర్శనం, దానం చేయడం, పేదలు, నిస్సహాయులకు సాయం, పర్యావరణాన్ని పరిరక్షించడమే నిజమైన వేడుకని హైందవ ప్రవచనకర్తలు బోధిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా..

కాకినాడ జిల్లావ్యాప్తంగా రెండు రెవెన్యూ డివిజన్ల పరిధులైన కాకినాడ, పెద్దాపురం ఆర్‌డీవోల ఆధ్వర్యంలో దుకాణాల కేటాయింపులు జరిగాయి. శనివారం సాయంత్రం ఐదు గంటల సమయానికి పెద్దాపురం ఆర్‌డీవో పరిధిలో 60 దుకాణాలకు అనుమతులిచ్చారు. ఆరు మండలాల్లో కేవలం మూడింటి నుంచి వచ్చిన దరఖాస్తులకు అనుమతిచ్చిన షాపులు మాత్రమే. మరో మూడు మండలాల అనుమతులు పెండింగ్ ఉన్నాయి. కాకినాడ నగర పరిధిలో 88, గ్రామీణం పరిధిలో 22, నగరంలో ఇతర ఒక్కొక్కటిగా ఏర్పాటైనవి మరో 5 మొత్తం 115 దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. పోలీస్, ఫైర్, రెవెన్యూ శాఖల సమన్వయంతో అనుమతుల కేటాయింపులు జరిగాయి. అగ్నిమాపక శాఖ భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా దుకాణాలు ఏర్పాటు చేశారు. జిల్లావ్యాప్తంగా కాకినాడలోనే అత్యధిక దుకాణాల ఏర్పాటుకు అనుమతులివ్వడం విశేషం. కాకినాడ నగర పరిధిలోనే మొత్తం 93 దుకాణాల ఏర్పాటుకు లైసెన్సులు మంజూరయ్యాయి.

అవగాహన పెంపొందేలా...

దీపావళిపై అవగాహన పెంపొందేలా అగ్నిమాపక శాఖ క్షేత్ర స్థాయి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బాణసంచా కాల్చే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృత ప్రచారం చేస్తోంది. జిల్లా ఫైర్ ఆఫీసర్ పీవీఎస్ రాజేష్ పర్యవేక్షణలో కాకినాడ ఏడీఎఫ్‌వోలు ఉద్దండరావు సుబ్బారావు, బంగారు ఏసుబాబు ఆధ్వర్యంలో బృందాలతో పాటు, ఇతర అగ్నిమాపక కేంద్రాల ఫైర్ ఆఫీసర్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



విద్యార్థులకు దీపావళి జాగ్రత్తలను వివరిస్తున్న సాలిపేట ఏడీఎఫ్‌వో సుబ్బారావు



వ్యాపారులకు నిబంధనలు చెబుతున్న జగన్నాథపురం ఏడీఎఫ్‌వో ఏసుబాబు

ఫైర్ స్టేషన్లు	కాంటాక్ట్ నంబర్లు
కాకినాడ సాలిపేట	0884 2374571, 99637 26854
జగన్నాథపురం	0884 2374592, 99637 26902
పెద్దాపురం	99637 26982, 08852 241299
తుని	99637 27194, 08854 253601
ప్రత్తిపాడు	99637 27769, 08868-246709
పిఠాపురం	99637 27859, 08869 251501
జగ్గంపేట	73821 82834, 08852 233388

జాగ్రత్తలు ఇలా..

టపాసులు కాల్చే వేళ తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నిరోధించవచ్చని కాకినాడ సాలిపేట ఏడీఎఫ్‌వో ఉద్దండరావు సుబ్బారావు తెలిపారు. పలు జాగ్రత్తలను వివరించారు. బిగుతైన కాటన్ దుస్తులు ధరించాలి. పెద్దల సమక్షంలోనే పిల్లలు క్రాకర్స్ కాల్చాలి. ఇంటి లోపల, ఇరుకైన చోట్ల కాల్చరాదు. పూర్తిగా కాలని బాణసంచాపై నీరు లేదా ఇసుక వేయాలి. గుడిసెలు, గడ్డివాములను నీటితో తడపాలి, పెట్రోలు బంకులకు దూరంగా బాణసంచా కాల్చాలి. ఉద్గారాలను నేరుగా పీల్చరాదు. దుస్తులకు నిప్పంటుకుంటే కింద పడుకుని దొర్లాలి. టపాసులు కాల్చే చోట రెండు బకెట్ల నీరు అందుబాటులో ఉంచాలి.

అత్యవసరమైతే..

అనుకోని ఆపద సంభవిస్తే తక్షణమే ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేయాలని అధికారులు అంటున్నారు. 101 లేదా 112కి ఫోన్ చేయడం ద్వారా ఫైర్ సిబ్బంది సహకారం పొందవచ్చు.

ఆరోగ్యం ప్రధానం



వివిధ హానికారక వాయువుల సమ్మిళితంగా ఉండే బాణసంచా పొగ పీల్చడం వల్ల అనారోగ్య సమస్యలు వాటిల్లవచ్చు. గొంతు, ఊపిరితిత్తుల సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు, ఆస్తమా, కఫం, రక్తంలో ఆక్సిజన్ క్షీణత, తలనొప్పి, అలసట, గుండె సమస్యలు, కళ్లల్లో మంట, నాడీ వ్యవస్థపై దుష్ప్రభావం, కాలేయ, మూత్రపిండాల సమస్యలు తలెత్తవచ్చు. చిన్న పిల్లలు, వృద్ధులు, గర్భిణులకు అపాయకరం. వినికిడి లోపాలు, కంటి ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు. భారీ శబ్దం చేసే బాంబులు వెలిగిస్తే చెవులు మూసుకోవాలి.

– డాక్టర్ ఎంపీఆర్ విఠల్, పూర్వ సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

కాలుష్య రహితంగా జరపాలి



బాణసంచా కాల్చే వేళ వెలువడే పొగ వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుంది. గంధకపు పదార్థాలున్న టపాసుల వల్ల సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రేట్లు, నైట్రోసెల్యులోజ్ వల్ల నైట్రోజన్ ఆక్సైడ్లు, పూర్తి దహనం వల్ల కార్బన్ డై ఆక్సైడ్, పాక్షిక దహనం వల్ల ప్రాణాంతక కార్బన్ మోనాక్సైడ్లు వెలువడతాయి. పేలుళ్ల ధాటికి లెడ్, ఆర్సెనిక్, బేరియం, కాడ్మియం, అమ్మోనియం వంటి లోహాలూ వెలువడుతాయి. ఇవన్నీ ప్రాణాంతకం, పర్యావరణానికి హానికరం. ప్రజలు కాలుష్య రహిత దీపావళి జరుపుకోవాలి.

– ఏబీఎస్ శివశంకర్‌రావు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కాకినాడ

జాగ్రత్తలు తీసుకున్నాం



బాణసంచా అమ్మే కేంద్రాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకున్నాం. ఫైరింజిన్లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా ఏడు ఫైర్‌స్టేషన్ల పరిధిలో ప్రతి దుకాణం భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశాం. దుకాణదారులు నిబంధనలు మీరితే చర్యలు తప్పవు. ఎప్పటికప్పుడు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నాం. అత్యవసర స్థితిలో తక్షణమే ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయాలి.

– పీవీఎస్ రాజేష్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి

కోటి సంతకాల సేకరణకు అనూహ్య స్పందన

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

తుని రూరల్: మెడికల్ కాలేజీలు, అనుబంధ ఆస్పత్రులను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమానికి అనూహ్య స్పందన లభిస్తోందని, మరో కోటి సంతకాలు చేసేందుకు పార్టీలకతీతంగా ప్రజలు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. శనివారం తుని మండలం ఎస్.అన్నవరంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజా స్పందన, మరో కోటి సంతకాల సేకరణ విషయాన్ని పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానన్నారు. ప్రతి జిల్లాకు ఓ మెడికల్ కాలేజీ, అనుబంధంగా 500 పడకల ఆస్పత్రిని వైఎస్ జగన్ నిర్మించతలపెట్టారన్నారు. రాష్ట్ర ప్రజల కోసం 17 మెడికల్ కాలేజీలు తెచ్చారని, అందులో ఐదు ప్రారంభించగా, రెండు ప్రారంభోత్సవానికి సిద్ధం చేశారన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌తో రెండింటిని ప్రారంభించలేదన్నారు. మిగిలిన పది కాలేజీలు, ఆస్పత్రుల నిర్మాణం వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఆయా కాలేజీలు, ఆస్పత్రుల్లో అత్యాధునిక వసతులు, సాంకేతిక పరికరాలు, రోబోటిక్ సర్జరీలకు అనువుగా నిర్మాణాలు చేపట్టారన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆస్తులు సమకూర్చితే, సంపద సృష్టి పేరుతో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పీపీపీ అంటూ తమ అనుచరులకు ధారాదత్తం చేస్తోందని విమర్శించారు. ఈ విధానంపై మంత్రి లోకేష్ శాసన మండలి సాక్షిగా అబద్ధాలు చెప్పేందుకు యత్నించగా, చైర్మన్ అడ్డుకున్నారన్నారు. రూ.22 వేల కోట్ల రాయితీలు, నీరు, విద్యుత్ సదుపాయాలు కల్పిస్తుంటే, గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు జరుగుతుందన్నారు. దీనివల్ల రెండు లక్షల ఉద్యోగాలు రావన్నారు. ప్రపంచ వ్యాప్తంగా గూగుల్ సంస్థలో 1.60 లక్షల మంది ఉద్యోగాలు చేస్తున్నారన్నారు. విశాఖ గూగుల్ డేటా సెంటర్లో రెండు లక్షల ఉద్యోగాలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. విశాఖపట్నంలో పలు సంస్థలకు రూపాయికే ఎకరా భూమి ఇస్తున్న చంద్రబాబునాయుడు.. అమరావతిలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. దివంగత మహానేత వైఎస్సార్ ఏర్పాటు చేసిన సెజ్‌లలో పది వేల మందికి పైగా ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఆ విషయాన్ని స్వయంగా పవన్ కల్యాణ్ ఒప్పుకున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాక అమరావతి రాజధానిగా పరిపాలన సాగుతుందన్నారు. డక్ భవనాన్ని వైఎస్ జగన్ రూ.87 కోట్లతో నిర్మిస్తే, అంతకంటే చిన్నదైన సీఆర్‌డీఏ కార్యాలయానికి చంద్రబాబు మూడింతలు ఖర్చు చేశారన్నారు. ప్రతి వంద కిలోమీటర్లకు నకిలీ మద్యం ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి, విక్రయిస్తూ పేదల ప్రాణాలను తోడేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, లైంగిక దాడులు, నకిలీ మద్యానికి కూటమిలో భాగస్వాములుగా ఉన్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలే బాధ్యులన్నారు. ఇప్పటికైనా తప్పులను జనసేన, బీజేపీ ఖండించాలన్నారు. పార్టీ నాయకులు సకురు నాగేంద్ర నెహ్రూ, వంగలపూడి గోవిందుబాబు, గంటా చక్రరావు, వెలగా ఈశ్వరరావు, చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు, వంగలపూడి శ్రీనివాసరావు, కీర్తి బాలకృష్ణ, చోడిశెట్టి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



దాడిశెట్టి రాజా ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణలో సంతకం చేస్తున్న బీజేపీ నాయకుడు పిన్నంరాజు వర్మ

వైద్య విద్యను దూరం చేసే కుట్ర

- జై భీమ్ రావ్ భారత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్
- కూటమి ప్రభుత్వ పీపీపీ విధానంపై నేతల మండిపాటు
- మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై మేధోమథన సదస్సు



కోటి సంతకాల సేకరణకు మద్దతు తెలుపుతున్న జై భీమ్‌రావ్ భారత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్, చిత్రంలో వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తదితరులు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): బహుజనులకు వైద్య విద్యను దూరంగా చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని, అందుకే మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తుందని జై భీమ్ రావ్ భారత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రావణ్ కుమార్ మండిపడ్డారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో శనివారం మేధోమథన సదస్సు నిర్వహించారు. తొలుత కాకినాడ ఇంద్రపాలెం సెంటర్ వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కలెక్టరేట్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జై భీమ్ రావ్ పార్టీ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది జగ్గారపు మల్లికార్జున అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా శ్రావణ్‌కుమార్ హాజరుకాగా, విశిష్ట అతిథులుగా మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎంపీ వంగా గీత హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, ఓ హాస్పిటల్ నిర్మించాలంటే రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్లు అవసరం అవుతాయన్నారు. కేవలం బినామీలకు దోచిపెట్టడానికే పీపీపీ విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేస్తే పేద, మధ్య తరగతి విద్యార్థులకు డాక్టర్లయ్యే అవకాశం పూర్తిగా లేకుండా పోతుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలను తీసుకొచ్చి రూ.5,600 కోట్లను బడ్జెట్‌లో కేటాయిస్తే, మిగిలిన రూ.3 వేల కోట్లను కూటమి ప్రభుత్వం కేటాయించలేక ప్రైవేటీకరణ చేస్తుందని విమర్శించారు. ఏడాదికి రూ.వెయ్యి కోట్ల చొప్పున బడ్జెట్‌లో కేటాయిస్తే, మూడేళ్లలో 17 మెడికల్ కాలేజీలు పూర్తి చేయవచ్చనే అవగాహన లేకుండా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పాలన సాగించడం సిగ్గుచేటన్నారు. డాక్టర్ అయ్యే నిరుపేదల విద్యార్థుల కలను కూటమి ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తుందని మండిపడ్డారు. 33 ఏళ్ల లీజుకు ఇచ్చే పీపీపీ విధానం వల్ల రూ.వేలాది కోట్ల ధనార్జన చేస్తారన్నారు. పీపీపీ విధానంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ బినామీలు మాత్రమే ఉన్నారని ఆరోపించారు. పిఠాపురం ప్రజలు బాధపడుతున్నారని, దేశం మొత్తం పిఠాపురం వైపు చూస్తుందన్న పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై మాట్లాడుతూ.. ఇప్పుడు పిఠాపురం ప్రజల ఆలోచన మరోలా ఉందని ఎద్దేవా చేశారు. రియల్ స్టార్‌కి, రీల్ స్టార్‌కి చాలా తేడా ఉందని పవన్ కల్యాణ్ గుర్తించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి ఫొటో ఎందుకు ఉండాలో చెప్పాలని, దీనిపై న్యాయస్థానంలో రాజీలేని పోరాటం చేస్తామని చెప్పారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా జై భీమ్ రావ్ భారత పార్టీ నుంచి ఎనిమిది లక్షల సంతకాల సేకరణ చేపడతామని హామీ ఇచ్చారు.

ప్రజలు పోరాడాలి

మాజీ ఎంపీ వంగా గీత మాట్లాడుతూ, వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయంపై రాష్ట్ర ప్రజలందరూ పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. వ్యక్తిత్వ వికాసానికి, సమాజ వికాసానికి విద్య నిజమైన ఆయుధం లాంటిదని, అటువంటి విద్యను పేద విద్యార్థులకు దూరం చేసే పని కూటమి ప్రభుత్వం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ రావ్ భారత్ పార్టీ పార్లమెంటరీ అభ్యర్థి ఏనుగుపల్లి కృష్ణ, న్యాయవాదులు దాడిశెట్టి వీరబాబు, గుగ్గిలపు హరీష్, వైఎస్సార్ సీపీ నాయకులు రాగిరెడ్డి చంద్ర కళాదీప్తి, రాగిరెడ్డి బన్నీ, సుంకర విద్యాసాగర్, వర్ధినీడి సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై బాధ్యత లేదు

కూటమి ప్రభుత్వం ప్రజలపై బాధ్యత లేకుండా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి కన్నబాబు విమర్శించారు. పేద, మధ్యతరగతి వర్గాలు బాగుండాలని కోరుకునే మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.ఎనిమిది వేల కోట్లతో మెడికల్ కాలేజీలు నిర్మించాలని భావిస్తే, వాటిని ప్రైవేటీకరణ చేయాలన్న దురాలోచనలతో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఒకరోజు హాస్పిటల్‌లో ఉండాలంటే రూ.20 వేల నుంచి రూ.25 వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నేడు ఉందన్నారు. గత 15 రోజులుగా డాక్టర్లు సమ్మె చేస్తుంటే కనీసం వారిని పిలిచి మాట్లాడలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందన్నారు. ఆగిపోతున్న గుండెలను తిరిగి కొట్టుకునేలా చేసిన మహానేత దివంగత వైఎస్సార్ సేవలు, గత ప్రభుత్వంలో కరోనా సమయంలో చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవలను రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 72 రకాల మందులను, 14 రకాల ఉచిత టెస్టులను చేసేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని విమర్శించారు. పార్వతీపురం కేంద్రంలో 230 మంది చిన్నారులు అస్వస్థతకు గురై కామెర్లు వస్తే 120 మంది చిన్నారులను కేజీహెచ్‌లో చేర్పించే స్థాయికి కూటమి ప్రభుత్వం ఉందన్నారు. తాగునీటిలో మలమూత్రాలు ఉన్నాయని రిపోర్టు వచ్చిందన్న విషయాన్ని ప్రభుత్వం ఇప్పటివరకు బయట పెట్టకపోవడం సిగ్గుచేటన్నారు.

తపాసులు జాగ్రత్త

- కాల్చేటప్పుడు అప్రమత్తత అవసరం
- పిల్లలను ఓ కంట కనిపెట్టాలి
- రేపు దీపావళి పర్వదినం

కొత్తపేట: మతాబులు మమతలు పూయ.. చిచ్చుబుడ్లు కాంతులనీయ.. తారాజువ్వలు గాలిలో ఎగరేయ.. వెన్నముద్దలు వెలుగులనీయ.. అందాల తారలు వాకిట్లో వాలినట్లు టపాసులతో సందడి చేయ.. వెలుగుల పండగను ఆనందాల రవళిలా జరుపుకొందాం. ఈ నెల 20న దీపావళి సందర్భంగా టపాసుల మోతతో ఊరూవాడా దద్దరిల్లనుంది. అయితే వాటిని కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలి. ఎవరికి వారే గ్రహించి అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ఏమాత్రం అజాగ్రత్త ఉన్నా పెను ప్రమాదం తప్పదని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా దీపావళి రోజున పాటించాల్సిన జాగ్రత్తలు కొత్త కాకపోయినా మరోసారి గుర్తు చేసుకుంటే చాలా మంచిదని చెబుతున్నారు. టపాసులు కాల్చే చిన్నారులను దగ్గరుండి చూసుకోవాలని, వారి విషయంలో తస్మాత్ జాగ్రత్త అని అంటున్నారు. దీపావళి దగ్గర పడుతున్న కొద్దీ బాణసంచా తయారీలో యాజమాన్యం, సిబ్బంది విశ్రమించకుండా పనిలో నిమగ్నమవుతారు. చిన్నపాటి నిర్లక్ష్యం, అజాగ్రత్త పెను ప్రమాదానికి దారి తీస్తుంది. ఏటా జిల్లాలో ఒకటో, రెండో ప్రమాదాలు జరుగుతున్నాయి.. ప్రాణాలు హరిస్తున్నాయి. ఈ ఏడాది తాజాగా రాయవరంలో భారీ విస్ఫోటం సంభవించి పది మంది, అయినవిల్లి మండలం విలసలో ఇద్దరు మృత్యువాత పడిన ఘటనలను అధికారులు ప్రస్తావిస్తున్నారు. ఇకపై ఏ చిన్న ప్రమాదం జరగకుండా దీపావళిని జరుపుకోవాలని సూచిస్తున్నారు.

అగ్నిమాపక కేంద్రాల ఫోన్, ఎస్ఎఫ్ఓల ఫోన్ నంబర్లు

అమలాపురం–9963727665– 8856 231101
కొత్తపేట - 9963728051 - 08855 243299
మండపేట - 9963727741-08855 232101
రామచంద్రపురం-9440149394-08857 242401
రాజోలు- 9603727995 - 08862 221101
ముమ్మిడివరం-7989956542-08856271101

పర్యావరణాన్ని పరిరక్షించేలా..

దీపావళి రోజున పర్యావరణాన్ని పరిరక్షించేందుకు అన్నివర్గాల ప్రజలు చైతన్యవంతులు కావాలి. క్రాకర్స్ ఎంత తక్కువ వినియోగిస్తే వాతావరణ కాలుష్యం అంత తగ్గుతుంది. దీపావళి అంటేనే వెలుగుల పండగ. అందుకే ప్రతి ఒక్కరూ ఇళ్ల ముందు దీపాలు వెలిగించుకుని పండగ జరుపుకోవాలని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు.

పండుగ రోజున ఇలా చేద్దాం..

- గ్రామీణ ప్రాంతాల్లో పంట పొలాలు, గడ్డివాములు, పూరి గుడిసెలు ఉండే ప్రదేశాల్లో రాకెట్లు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు వంటి టపాసులు కాల్చరాదు.
- టపాసుల పనితీరు, వెలిగించాల్సిన విధానం తదితర అంశాలపై అవగాహన కలిగి ఉండాలి.
- పిల్లలు పెద్దల పర్యవేక్షణలోనే క్రాకర్స్ కాల్చాలి.
- ఇరుకైన ప్రదేశాలు, వాహనాల రద్దీ ఎక్కువగా ఉండే చోట టపాసులు కాల్చరాదు.
- బాణసంచా కాల్చేటప్పుడు కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి.



కొత్తపేటలో బాణసంచా తయారీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఎస్పీ మురళీమోహన్

జిల్లాలో బాణసంచా షాపులు

తయారీ కేంద్రాలు	18
హోల్‌సేల్ షాపులు	15
రిటైల్ షాపులు	సుమారు 455
(తాత్కాలిక లైసెన్స్ షాపులు)	

వ్యాపారులూ అప్రమత్తత అవసరం

జనసంచారం లేని, ఊరికి దూరంగా ఉండే ప్రాంతాల్లో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయాలి. అక్కడ ప్రమాదాలు జరగకుండా తగిన అగ్ని ప్రమాద నియంత్రణ సామగ్రి ఉంచుకోవాలి. బాణసంచా అమ్మే చోట ఇసుక, నీరు, కార్బన్ డై ఆక్సైడ్‌ను అందుబాటులో ఉంచాలి. దుకాణాల వద్ద పొగ, మద్యం తాగరాదు. ప్రతి దుకాణానికి మధ్య కనీసం 10 అడుగుల దూరం ఉండేలా చూసుకోవాలి. అలాగే విక్రయ కేంద్రాల వద్ద విద్యుత్ వైరింగ్ సరిగ్గా చూసుకోవాలి. ప్రతి షాపు వద్ద క్రాకర్స్ ధరల పట్టిక, అగ్నిమాపక కార్యాలయం ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచాలి.

అనుమతులు తప్పనిసరి



బాణసంచా తయారీ, హోల్‌సేల్, రిటైల్ విక్రయదారులు కచ్చితంగా నిర్దేశిత అనుమతులు పొందాలి. అక్రమంగా మందుగుండు సామగ్రి కలిగి ఉన్నా, అమ్మకాలు చేపట్టినా చర్యలు తప్పవు. సమస్యలు తలెత్తితే తక్షణమే పోలీసు, సమీపంలోని అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించాలి.

–పి.శ్రీకర్, ఆర్డీఓ, కొత్తపేట

వెంటనే సమాచారం అందించాలి

దీపావళి బాణసంచా కాల్చేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పూరిళ్లు, గడ్డివాములు ఉండేచోట వాటిని నీటితో తడపడం, నీటిని సమీపంలో ఉంచుకోవడం మేలు. అలాగే బాణసంచా అమ్మేవారు కూడా అగ్నిమాపక నియంత్రణ పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలి. ప్రమాదం జరిగితే తక్షణమే 100, 101కు లేదా సమీపంలో ఫైర్ స్టేషన్, పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలి.

–ఎన్.పార్థసారథి, జిల్లా అగ్నిమాపక అధికారి, అమలాపురం

చీటీల పేరుతో రూ.కోటికి టోకరా

పెద్దాపురం (సామర్లకోట): కూలి పని చేసుకొని కొంత సొమ్ము దాచుకోవాలని చీటీలు వేసిన పేద మహిళలకు రూ. కోటి వరకు టోకరా వేసిన సంఘటన ఇది. పెద్దాపురం మండలం జి. రాగంపేటకు చెందిన 80 మంది మహిళలను నమ్మించి గ్రామానికి చెందిన ఒక మహిళ చీటీలు వేయించింది. చీటీలు పాడుకున్న తరువాత సొమ్ము అడిగితే కేసులు పెడతానని బెదిరించడంతో శుక్రవారం మహిళలు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై మౌనిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వసంతకుమార్ (32)



ప్రత్తిపాడు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న సంధ్య

- అతడి భార్యకు తీవ్రగాయాలు
- విజయవాడ నుంచి ఇచ్ఛాపురం వెళ్తుండగా ఘటన

ప్రత్తిపాడు: మండలం ధర్మవరం గ్రామ జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయ పడిన ఘటన శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం లొద్దిపుట్టి గ్రామానికి చెందిన పిట్టా వసంతకుమార్ (32) విజయవాడలోని ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నాడు. తన స్వగ్రామం వెళ్లేందుకు తన భార్య సంధ్యతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. అరకు లోయ వెళ్లి, అక్కడి నుంచి స్వగ్రామం వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. జాతీయ రహదారిపై ధర్మవరం గ్రామ సమీపంలో రొయ్యల మేత తీసుకువెళ్తున్న వ్యాన్ మరమ్మతులకు గురికావడంతో నిలిపివేశారు. ఆగి ఉన్న వ్యాన్‌ను వసంతకుమార్ బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సంధ్యను ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తరలించారు. మృతదేహాన్ని శవపరీక్షకై స్థానిక సీహెచ్‌సీ తరలించారు. ప్రత్తిపాడు ఎస్సై ఎస్.లక్ష్మీకాంతం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రిని సాగనంపి.. తనయుడూ ఆ వెనకే..

- అంతిమ సంస్కారం చేసివచ్చి కుప్పకూలిన తనయుడు
- తండ్రి మరణం జీర్ణించుకోలేక మృతి



మృతి చెందిన తండ్రీతనయులు నరసింహమూర్తి, రాజా (ఫైల్)



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: తండ్రి దహన సంస్కారాలు పూర్తి చేసి ఇంటికి వచ్చిన తనయుడు అస్వస్థతకు గురై మృతి చెందిన ఘటన మండలంలోని ఉత్తరకంచిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కందా నరసింహమూర్తి (70) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు కందా రాజా (45) తండ్రికి దహన సంస్కారాలు పూర్తి చేసి ఇంటికి చేరుకున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రాజా ఆరోగ్యం సహకరించకపోవడానికి తోడు, తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేక ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు రాజాను చికిత్స నిమిత్తం ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయన అంత్యక్రియలను బంధువులు నిర్వహించారు. ఈ ఘటన కుటుంబ సభ్యులతో పాటు స్థానికులను కన్నీరు పెట్టించింది. రాజా పంచాయతీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. రాజా కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్య



శిరీష (ఫైల్)

అనపర్తి: భర్త మందలించాడన్న మనస్తాపంతో భార్య మృతి చెందిన ఘటన శనివారం అనపర్తిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నమ్మి శిరీష (30) భర్త సంతోష్‌తో కలసి స్థానిక సింధు టవర్స్‌లో కాపురం ఉంటోంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శనివారం ఉదయం సంతోష్ జండూబాం అడగగా కనిపించకపోవడంతో ఇంట్లో వస్తువులు ఎక్కడ పెట్టావు నీకు తెలియదా అని భార్య శిరీషను మందలించాడని, దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి చేసుకుని చనిపోయినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పోలీసులు తెలిపారు. ధవళేశ్వరంలో ఉంటున్న శిరీష తల్లి లంక అమ్మాజీ తన కుమార్తె చావుకి కారణం భర్త సంతోష్, అత్త, ఆడపడుచు వేధింపులేనని అనుమానం వ్యక్తం చేశారని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తెలిపారు.

కాకినాడలో గోల్డ్‌కప్ హాకీ ఇండియా పోటీలు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో కాకినాడలో మొదటి సారిగా గోల్డ్‌కప్ హాకీ ఇండియా చాంపియన్‌షిప్ 2026 పోటీలు జరుగుతాయని క్లబ్ ఫౌండర్ రవిచంద్ర తెలిపారు. ఈ మేరకు పోటీల బ్రోచర్‌ను శనివారం కలెక్టర్ షణ్మోహన్‌కు అందించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 4 నుంచి 14 వరకూ ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో 12 పురుషుల జట్లు, ఆరు మహిళా జట్లు పాల్గొంటాయన్నారు.



హాకీ ఇండియా పోటీల బ్రోచర్‌ను కలెక్టర్‌కు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్
- ఘనంగా ఫెన్సింగ్ పోటీల ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న పాఠశాల డైరెక్టర్ సుగుణారెడ్డి తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): కాకినాడ రూరల్ మండలం లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్‌లో అండర్–14 బాలబాలికల ఫెన్సింగ్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సబ్ జూనియర్స్ విభాగంలో నిర్వహించే ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల పల్లి రామస్వామి, ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి హాజరయ్యారు. కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అధ్యక్షత వహించారు. ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా, సుగుణారెడ్డి పోటీలను ప్రారంభించారు. ఎంపీ శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ పోటీలలో 13 జిల్లాల నుంచి 200 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫెన్సింగ్ సంఘ కార్యదర్శి కృష్ణమోహన్, మాజీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ బొమ్రా పాల్గొన్నారు.

వైభవంగా సుదర్శన హోమం

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామికి ప్రీతిపాత్రమైన శనివారం రోజున ద్వాదశి కలిసి రావడంతో భక్తులు అమలాపురం స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ద్వాదశి సందర్భంగా సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కంచిపల్లి అబ్బులు, ఈవో సత్యకుమార్, ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

వాడవాడలా వేంకటేశునామమే..

కొత్తపేట: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవ యజ్ఞం శనివారం ఘనంగా ముగిసింది. చక్రస్నానం శాస్త్రోక్తంగా జరిగింది. రాత్రి జరిగిన ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఈ నెల పదో తేదీ నుంచి ప్రారంభమైన శ్రీవారి బ్రహ్మోత్సవాలు తిరుమలలో జరిగే వేడుకలను తలపించాయి. ఆలయ ప్రాంగణం, మాడ వీధులను పుష్పాలంకరణలతో, క్షేత్రం అంతటా విద్యుద్దీపాలతో అలంకరించారు. నిత్యం పూజలు, అభిషేకాలు, శ్రీవారి అలంకరణలు, వాహన సేవలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా సాగాయి. రాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ఉత్సవాలను తిలకించారు. ఆఖరి రోజు ఈఓ చక్రధరరావు పర్యవేక్షణలో వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం ఖండవిల్లి రాజేశ్వరవర ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

వైభవంగా చక్రస్నానం

ఉత్సవాల ముగింపునకు సూచికగా గౌతమీ నదీ తీరంలో వేలమంది భక్తుల గోవింద నామ స్మరణల నడుమ అవభృత స్నానాన్ని (చక్రస్నానం) దేవస్థానం అధికారులు, అర్చకులు, వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఉత్సవ కమిటీ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

యథాతథంగా ఆర్జిత సేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో రద్దు చేసిన ఆర్జిత సేవలను ఆదివారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు ఈఓ తెలిపారు.